క్లుప్తంగా

ప్రతి ఒక్కరు భూములను రీ సర్వే చేయించుకోవాలి

తహసీల్దారు శ్రీనివాసయాదవ్



అచ్చంపేట: ప్రతి రైతు, ప్రతి భూ యజమాని తమ భూములకు సంబంధించి రీ సర్వే చేయించుకుని, హద్దులు వేయించుకోవాలని తహసీల్దారు జి.శ్రీనివాసయాదవ్ కోరారు. మండలంలోని మాదిపాడులో బుధవారం జరిగిన అవగాహన కార్యక్రమం, ర్యాలీని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. రీ సర్వే వల్ల భూ వివాదాలు తొలగిపోతాయని, భూములను డ్రోన్స్, జీపీఎస్ మిషన్స్ ద్వారా సర్వే చేయడం ద్వారా కచ్చితత్వమైన కొలతలు వస్తాయని చెప్పారు. అనంతరం గ్రామంలో రీ సర్వేపై ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ భూక్యా స్వర్ణమ్మభాయి, ఆమె భర్త రమేష్ నాయక్, సర్పంచ్ మాదా ఈశ్వరమ్మ, ఆమె భర్త మాదా వెంకట్రావు, మండల సర్వేయరు ఏడుకొండలు, రెవెన్యూ ఇన్‌స్పెక్టరు నాగేశ్వర రావు, రెవెన్యూ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గో వధ చేసే వారిపై చర్యలు తీసుకోవాలి

విశ్వహిందూ పరిషత్ మండల ప్రముఖ్ మల్రెడ్డి



అచ్చంపేట: గో వధ చేసే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ విశ్వహిందూ పరిషత్– గో రక్ష విభాగ్, మండల ప్రముఖ్ తుమ్మా మల్రెడ్డి కోరుతూ వివిధ గ్రామాల సర్పంచ్‌లకు బుధవారం విజ్ఞాపన పత్రాలు అందజేశారు. ఇందులో భాగంగా గోవధ నిషేధంపై గ్రామంలో మైకుల ద్వారా ప్రచారం చేయాలని, చాటింపు ద్వారా అందరికీ తెలియజేయాలని కోరుతూ పెదపాలెం సర్పంచ్ నెల్లూరి హరిబాబుకు వినతి పత్రం అందజేశారు. జూన్ 7న బక్రీద్ నాటికి అందరికీ అవగాహన కల్పించి గ్రామాలలో గో వధను పూర్తిగా నిషేధించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై ఉన్నతాధికారుల సహకారం కూడా కోరనున్నట్లు మల్రెడ్డి చెప్పారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నెల్లూరి చంద్రబాబు, ఆర్యవైశ్య సంఘ మాజీ అధ్యక్షుడు అన్నవరపు శ్రీనివాసరావు, డి.నగేష్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో భక్తాంజనేయ స్వామి జయంత్యుత్సవం



సత్తెనపల్లి: పట్టణంలోని మహారాష్ట్ర వీధిలో వేంచేసియున్న భక్తాంజనేయస్వామి దేవస్థానంలో హనుమత్ జయంత్యుత్సవ కార్యక్రమం రెండో రోజు బుధవారం స్వామి వారికి ఆలయ అర్చక స్వామి వేదాంతం విజయ నరసింహాచార్యులు ఆధ్వర్యంలో విశేష అభిషేకాలు, హనుమత్ హోమం, విశేష పుష్పాలంకరణ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామి వారికి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా తేనెటీ వెంకటేష్, వెంకుబాయ్ దేవాలయానికి ఢమరుకాన్ని అందించారు. భక్తులకు ఎలాంటి ఆటంకం కలగకుండా తుమ్మల శ్రీపతి, కే బలరామకృష్ణ, వెంకటేశ్వర్లు, కృష్ణ సాయి, శివప్రసాద్, పవన్, వసుంధర, సుకన్య, ఉష ఏర్పాట్లను పర్యవేక్షించారు. దేవాలయ కమిటీ సభ్యులు భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

నేడు హనుమత్ జయంతి వేడుకలు



పెదకూరపాడు : మండల పరిధిలోని 75త్యాళ్ళూరులో కోదండరామాలయం వద్ద వేంచేసియున్న ఆంజనేయస్వామి ఆలయంలో గురువారం హనుమత్ జయంతి వేడుకలు నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధానార్చకులు తూములూరి శేషాచలపతి శర్మ, ఈఓ సత్యనారాయణ రెడ్డి, ధర్మకర్త కొల్లి పిచ్చిరెడ్డిలు బుధవారం తెలిపారు. గురువారం ఉదయం తోరణపాకు మహోత్సవంతో ప్రారంభించి, ఆంజనేయస్వామికి విశేష అభిషేకం, ఆకుపూజ జరుపనున్నట్లు వెల్లడించారు. ఉదయం 10 గంటలకు శాంతి కళ్యాణం, 11 గంటల నుంచి అన్నదానం నిర్వహించనున్నట్లు చెప్పారు. అధిక సంఖ్యలో భక్తులు హనుమత్ జయంతి వేడుకల్లో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించి స్వామివారి ఆశీస్సులు పొందాలని కోరారు.

పచ్చిరొట్ట సాగు.. భూసారం బాగు

- జీలుగ, పిల్లిపెసర, జనుము సాగుతో తగ్గనున్న రసాయనిక ఎరువుల వాడకం
- తొలగనున్న చీడపీడలు, తెగుళ్ల బెడద
- తక్కువ పెట్టుబడులతో అధిక దిగుబడులు సాధ్యం



జూపూడి వద్ద సాగుచేసిన పచ్చిరొట్ట ఎరువు(జీలుగ పంట)

అమరావతి: ఇబ్బడి ముబ్బడిగా రసాయన ఎరువుల వాడకంతో భూసారం తగ్గిపోతోంది. పంటల దిగుబడులూ అంతంత మాత్రంగానే వస్తున్నాయి. అవి కూడా విషతుల్యమవుతూ మానవ జీవనంపై తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయి. అందుకే రసాయన ఎరువులను తగ్గించి పచ్చిరొట్ట ఎరువుల సాగుతో భూసారాన్ని పెంచుకుని సేంద్రియ ఎరువులతో పంటలు పండించాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. జీలుగ విత్తనాలను చిన్నపాటి వర్షం కురిసిన వెంటనే ఎకరాకు 12 నుంచి 16 కిలోలు పచ్చిరొట్ట పంటగా చల్లుకోవాలి. విత్తనాలు మొలకెత్తి పూతదశకు వచ్చిన సమయంలో 8 నుంచి 10 టన్నుల పచ్చిరొట్ట ఎరువు లభిస్తుంది. ఓ టన్ను పచ్చిరొట్ట ఎరువులో సుమారు 6 కిలోల నత్రజని, ఒకటిన్నర కిలోల భాస్వరం, పొటాష్ లభిస్తాయి. ట్రాక్టర్‌తో జీలుగను పొలంలో కలియదున్నాలి. తర్వాత ఎకరాకు 50 కిలోల చొప్పున సూపర్ ఫాస్ఫేట్ చల్లితే దున్నేసిన జీలుగ పూర్తిగా కుళ్లిపోయి పొలం సారవంతమవుతుంది. పచ్చిరొట్ట ఎరువులైన జీలుగ, పిల్లిపెసర, జనుము సాగుకు అవసరమైన విత్తనాలను రైతులకు రాయితీపై ప్రభుత్వం అందజేస్తుంది. రైతులు వాటిని సద్వినియోగం చేసుకొని పొలాల్లో సాగు చేసుకోవటం వల్ల పెట్టుబడులు తగ్గించుకోవటం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చునని వ్యవసాయ అధికారులు పేర్కొంటున్నారు. అలాగే పంటలకు చీడపీడలు, తెగుళ్ల బెడదను నివారించవచ్చు.

పచ్చిరొట్ట సాగు వల్ల ప్రయోజనాలు

- భూమి భౌతిక, జీవ, రసాయన లక్షణాలు వృద్ధి చెందుతాయి. తక్కువ ఖర్చుతో నేలకు సేంద్రియ పదార్థం అధిక మోతాదులో అందుతుంది. తద్వారా నేలకు నీటిని, పోషకాలను నిల్వ చేసుకునే సామర్థ్యం పెరుగుతుంది.
- నేల గుల్లబారి గాలి ప్రసారం పెరగటంతో పాటు మురుగునీటి వ్యవస్థ పెరుగుతుంది. సేంద్రియ పదార్థం నేలకు అందటం వల్ల నేలలో సూక్ష్మజీవులు వృద్ధి చెంది అనేక రసాయన చర్యలు జరిగి జింక్, మాంగనీసు, ఇనుము, కాల్షియం వంటి సూక్ష్మధాతువులు పంటకు అందేలా చేస్తాయి.
- పచ్చిరొట్ట ఎరువుల వల్ల రసాయనిక ఎరువుల వాడకం తగ్గుతుంది. రసాయనిక ఎరువులు వినియోగించకపోయినా 75 శాతం నత్రజని లభిస్తుంది.
- నేలకు సహజ మిత్రులైన వానపాముల ఉత్పత్తికి దోహదపడుతుంది. పొలంలో కలుపు మొక్కల వృద్ధిని అడ్డుకుని పంటల దిగుబడికి దోహదపడుతుంది.

త్వరలో పంపిణీ చేస్తాం

పంటల సాగుకు నెల రోజులు ముందుగా పంట పొలాల్లో పచ్చిరొట్ట ఎరువులను సాగు చేసుకోవటం వల్ల భూసారం పెరిగి పంటలకు అవసరమైన నత్రజని, భాస్వరం, పొటాషియంతో పాటు సూక్ష్మధాతువుల శాతం పెరుగుతుంది. తద్వారా పంటలకు అవసరమైన పోషకాలు సకాలంలో అంది దిగుబడులు పెరుగుతాయి. పంటల సాగు పెట్టుబడులు తగ్గి అధిక దిగుబడులు సాధించవచ్చు. త్వరలో సబ్సిడీపై పచిరొట్ట విత్తనాలైన జీలుగ, పిల్లిపెసర, జనుము విత్తనాలను రైతులకు పంపిణీ చేస్తాం.

– ఎస్‌కేఎఫ్ అహ్మద్, మండల వ్యవసాయాధికారి, అమరావతి

24 నుంచి పెద్దింటమ్మతల్లి దేవాలయ వార్షికోత్సవాలు



అమరావతి: ప్రసిద్ధ శైవక్షేత్రమైన అమరావతిలో వేంచేసియున్న గ్రామ దేవత పెద్దింటమ్మ తల్లి దేవాలయ ప్రతిష్టా వార్షికోత్సవాలు ఈ నెల 24, 25 తేదీలలో నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దేవాలయ వార్షికోత్సవ కార్యక్రమంలో 24వ తేదీన విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవాచనం, పంచామృత స్నపన, విశేష కుంకుమార్చన కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. అలాగే రెండవ రోజు 25వ తేదీ అమ్మవారికి కుంకుమార్చనలు, ప్రత్యేక పూజల అనంతరం శ్రీలక్ష్మీగణపతి హోమం, రుద్ర హోమం శక్తిదుర్గాచండీ హోమం అనంతరం పూర్ణాహుతి నిర్వహిస్తామన్నారు. 25న ఉదయం 11 గంటల నుంచి దేవాలయానికి వచ్చిన భక్తులందరికి అన్న సంతర్పణ జరుగుతుందని తెలియజేశారు. వార్షికోత్సవాలలో భక్తులు పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని నిర్వాహకులు కోరారు.

వైభవంగా ఆంజనేయ స్వామి విగ్రహ పునః ప్రతిష్ట



పెదకూరపాడు : పెదకూరపాడు మండల పరిధిలోని జలాల్‌పురం గ్రామంలో వేంచేసి ఉన్న ఆంజనేయస్వామి ఆలయ పునః ప్రతిష్ఠ కార్యక్రమం బుధవారం భక్తిశ్రద్ధలతో వైభవంగా జరిగింది. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెదకూరపాడు శాసనసభ్యులు భాష్యం ప్రవీణ్, లావణ్య దంపతులు ఆంజనేయ స్వామిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్మాణ నిర్వహణ కమిటీ సభ్యులు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేపట్టారు. భక్తులు విశేషంగా పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ఎడతెరిపి లేని వాన.. రోడ్లపై నిలిచిన నీరు



నకరికల్లు ప్రధాన రహదారిలో నిలిచిన నీరు



అద్దంకి-నార్కట్‌పల్లి రాష్ట్ర రహదారిపై నిలిచిన వర్షపు నీరు

నకరికల్లు: భారీ వర్షం ధాటికి అద్దంకి–నార్కట్‌పల్లి రాష్ట్ర రహదారి, అంతర్గత ప్రధాన రోడ్డు జలమయంగా మారింది. బుధవారం ఉదయం నుంచి ప్రారంభమైన వర్షం ధాటికి ప్రధానరోడ్లు జలమయమయ్యాయి. మండలంలోని పలు గ్రామాల్లో వర్షం కురిసింది. ఉదయం నుంచే కారుమబ్బులు కమ్ముకొని ఉరుములు, మెరుపులతో ఎడతెరిపి లేని వర్షం కురిసింది. రాష్ట్ర రహదారిపై నీరు నిలవడంతో వాహనాల రాకపోకలతో చిందిపడుతున్న వర్షపు నీటితో రోడ్డుకు ఇరువైపులా చిరువ్యాపారులు అవస్థలు పడ్డారు. కనీసం బస్ షెల్టర్ కూడా లేకపోవడంతో బస్సుల కోసం వేచి ఉన్న ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు.

అదృశ్యం కేసు నమోదు

క్రోసూరు: వృద్ధుడు అదృశ్యం కేసు మండలంలో నమోదయింది. క్రోసూరుకు చెందిన వృద్ధుడు షేక్ ఆదం షఫీ ఈ నెల 14వ తేదీ నుంచి కనబడటం లేదని అతని భార్య ఖాశింబీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు బుధవారం మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పి.రవిబాబు తెలిపారు. ఆదం షఫీకి 63 సంవత్సరాలుంటాయని, పక్షవాతం కారణంగా మాటలు సరిగా పలకలేడని, ఇంటి నుంచి నాలుగు రోడ్ల సెంటర్‌కు వెళ్లి తిరిగి ఇంటికి చేరలేదని ఎస్‌ఐ తెలియజేశారు. ఇప్పటి వరకు జాడ తెలియరాలేదని, ఆచూకి తెలిసిన వారు క్రోసూరు ఎస్‌ఐ ఫోను నెంబర్ 9440796235కు, పోలీసుస్టేషన్ 08640-227133 ఫోను చేయాలని ఆయన కోరారు.

సెయింట్ జోసఫ్స్ కరస్పాండెంట్‌గా ఫాదర్ గోవిందు బాలస్వామి



రెంటచింతల: స్థానిక సెయింట్ జోసఫ్స్ ఉన్నత పాఠశాల నూతన కరస్పాండెంట్‌గా, సెయింట్ థెరిసా వసతి గృహానికి రెక్టర్‌గా రె. ఫాదర్ గోవిందు బాలస్వామిని నియమిస్తూ గుంటూరు పీఠాదిపతులు డాక్టర్ సీహెచ్ భాగ్యయ్య బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి వరకు ఇక్కడ రె.ఫాదర్ పీటర్ పాపయ్య విధులు నిర్వహించారు. బాలస్వామి 1997లో స్థానిక కానుకమాత చర్చి అసిస్టెంట్ ఫాదర్‌గా, 2009 నుంచి 2017 వరకు స్థానిక సాగరమాత జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ అండ్ కరస్పాండెంట్‌గా ఫాదర్ బాలస్వామి అంకితభావంతో సేవలు అందించారు. పల్నాడు ప్రాంతంలో పేద విద్యార్థులకు డిగ్రీ చదువులు అవసరాన్ని గుర్తించి ఆనాటి గుంటూరు పీఠాధిపతులుగా ఉన్న డాక్టర్ గాలిబాలి ఆశీస్సులతో విజ్‌డమ్ డిగ్రీ కళాశాల స్థాపనకు ఎంతో కృషి చేశారు. అనంతరం యూఎస్‌ఏలోని మిసోరి రాష్ట్రంలోని బెన్‌టన్ ప్యారీస్‌లో దైవసేవకులుగా పని చేశారు. ఈ సందర్భంగా ఫాదర్ బాలస్వామి మాట్లాడుతూ 1949 స్థాపించిన సెయింట్ జోసఫ్స్ ఉన్నత పాఠశాల ఒక దేవాలయమని క్రమశిక్షణకు, విలువలకు మారుపేరుగా వెలుగొందుతుందన్నారు. 76 ఏళ్ల పాటు పల్నాడు ప్రాంతంలోనే కాకుండా రాష్ట్రంలో కూడా రెంటచింతల సెయింట్ జోసఫ్స్ ఉన్నత పాఠశాలకు ఒక ప్రత్యేక గుర్తింపు ఉందని పేర్కొన్నారు.

మంచికల్లులో జెడ్పీ పాఠశాల ఫ్లెక్సీ ఆవిష్కరణ

రెంటచింతల: పల్నాడు కోనసీమగా పేరు పొందిన మంచికల్లులో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలతో పాటు మరో ఒక మోడల్ ప్రైమరీ స్కూల్‌ను ఏర్పాటు చేసి 12 మంది అర్హత కలిగిన ఉపాధ్యాయులను రాష్ట్ర ప్రభుత్వం నియమించడం హర్షణీయమని సర్పంచి గోగుల పుల్లారెడ్డి అన్నారు. బుధవారం గ్రామంలో ఉన్నత పాఠశాల ఏర్పాటుకు సంబంధించిన ఫ్లెక్సీని గ్రామ పెద్దలు యరపతినేని మట్టయ్య, ఉపాధ్యాయులతో కలసి ఆవిష్కరించారు. మన గ్రామ విద్యార్థులు ముఖ్యంగా బాలికల బంగారు భవిష్యత్‌కు గ్రామ పెద్దలు, పూర్వ విద్యార్థులు, విద్యావేత్తలు, తల్లిదండ్రులు అందరం కలిసి కృషి చేద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు షేక్ శిలార్ అహ్మద్, వీరబోయిన లింగం పాల్గొన్నారు.

ప్రపంచ యోగా గురువు భారత్

- ఎంపీడీవో బండి శ్రీనివాసరెడ్డి
- మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో యోగాపై అవగాహన



యోగా శిక్షణలో భాగంగా సూర్య నమస్కారాలు చేస్తున్న అధికారులు



మాట్లాడుతున్న ఎంపీడీవో రత్నం, పక్కన అధికారులు

సత్తెనపల్లి: ప్రపంచ దేశాలకు యోగా గురువుగా భారత్ కొనసాగుతుందని సత్తెనపల్లి ఎంపీడీవో బండి శ్రీనివాసరెడ్డి అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవంను ప్రతి ఏటా జూన్ 21న నిర్వహిస్తుండగా భారత్‌లో ఈసారి కార్యక్రమాన్ని ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నంలో అధికారికంగా నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. దీనిలో భాగంగా యోగాంధ్ర ప్రచారాన్ని పట్టణంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయ ఆవరణలో బుధవారం ఆయన ప్రారంభించి మాట్లాడుతూ మారుతున్న జీవన విధానంతో ప్రతి ఒక్కరూ ఒత్తిడికి గురవుతున్నారన్నారు. దీంతో ఆరోగ్య సమస్యలు చుట్టుముడుతున్నాయని, అయితే ఈ ఒత్తిడిని దూరం చేయడానికి ఒకే ఒక సాధనం యోగా అని అన్నారు. ఇటీవల కాలంలో యోగా పై ప్రజలకు మక్కువ పెరిగిందని, యోగా శిక్షణకు వెళ్లే వారిలో క్రమశిక్షణతో కూడిన జీవితం అలవడుతుందన్నారు. ఆధునిక జీవితంలో శారీరక వ్యాయామం లేక సీట్లకే పరిమితమైన ఉద్యోగాలు చేస్తూ అనేక మంది స్థూలకాయులై పోతున్నారన్నారు. దీనికి తోడు కల్తీ ఆహారం, జంక్, ఫాస్ట్ ఫుడ్లు శరీరాన్ని నాశనం చేస్తున్నాయన్నారు. యోగాసనాలు ఓ గంట పాటు వేయడం వల్ల రోగాలు తగ్గుముఖం పట్టి రోజంతా ఉల్లాసంగా ఉండటమే గాక అధిక శ్రమతో ఎక్కువ పని చేసుకుని జీవితంలో మరింత అభివృద్ధిని సాధించవచ్చని యోగా శిక్షకులు చెబుతున్నారన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాన్ని గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు శిక్షకుల సాయంతో నిర్వహించి అందరిని జూన్ 21న జరగబోయే అంతర్జాతీయ యోగా దినోత్సవంలో పాల్గొనేలా ప్రోత్సహించాలని కోరారు. డిప్యూటీ ఎంపీడీవో ఎ.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ యోగాపై ప్రాచుర్యం కల్పిస్తున్నారన్నారు. ఎంఈఓ ఎ.శ్రీనివాసరావు మాట్లాడుతూ పిల్లల నుంచి పెద్దల వరకు యోగా శిక్షణ తీసుకోవాలని పిలుపునిచ్చారు. ముందుగా పట్టణంలోని శక్తి యోగా సంస్థ శిక్షకులు మండల స్థాయి అధికారులకు, పంచాయతీ కార్యదర్శులకు, సచివాలయ సిబ్బందికి యోగా శిక్షణలో మెలకువలను నేర్పించారు.

యోగా ఆంధ్రప్రదేశ్‌పై అవగాహన

ముప్పాళ్ల: ప్రతి గ్రామంలోను యోగ వలన కలిగే ప్రయోజనాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించాలని ఎంపీడీవో పి.రత్నం చెప్పారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో యోగ ఆంధ్రప్రదేశ్‌పై పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, పీఈటీలకు బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీడీవో మాట్లాడుతూ జూన్ 21వ తేదీ వరకు గ్రామాల్లో యోగాపై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. గ్రామ, మండల స్థాయిలో కమిటీలు 'వెల్ బీయింగ్.. హ్యాపీ లివింగ్' అనే నినాదంతో కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో రూపవతి, సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, ఎంఈఓ-2 సీతారామిరెడ్డి, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, పీఈటీలు పాల్గొన్నారు.

యోగా సంసిద్ధత కార్యక్రమం

రాజుపాలెం: అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకుని యోగా సంసిద్ధత కార్యక్రమం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా యోగా టీచర్ దంతాల నాగాంజలి యోగా చేయడం వలన వచ్చే సత్ఫలితాలను వివరించి మండల స్థాయి అధికారులచేత యోగా చేయించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో జీవీ సత్యనారాయణ జూన్ 21వ తేదీ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా సంసిద్ధత కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. యోగా ప్రాముఖ్యతను గురించి తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు దుర్గేష్‌రావు, ఎంఈవో-2 నరసింహారావు, ఈవోపీఆర్‌డీ పగడాల ముక్కంటి, మండల స్థాయి అధికారులు, గ్రామ సచివాలయాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా యోగాంధ్ర లాంచింగ్

అమరావతి: స్థానిక ధ్యానబుద్ధ విగ్రహం ఎదురుగా ఉన్న బుద్ధవనం ప్రాంగణంలో బుధవారం యోగాంధ్ర లాంచింగ్ కార్యక్రమం నిర్వహించారు. యోగా ఇన్‌స్ట్రక్టర్ గిరిస్వామి ఆధ్వర్యంలో గ్రామస్తులు, అధికారులు యోగా శిక్షణ కార్యక్రమంలో పాల్గొని యోగాసనాలు వేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మేకల హనుమంతరావు, ఎంపీడీవో పార్వతి, తహసీల్దార్ డానియల్, ఎంఈవో శివబాబు, సీఐ అచ్చయ్య, ఆయుర్వేద వైద్యాధికారి జైనబ్ జహా తదితర అధికారులతో పాటు ఉద్యోగులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

యోగాతో మానసిక ప్రశాంతత: ఎంపీడీవో

బెల్లంకొండ: యోగా చేయడం ద్వారా మానసిక ప్రశాంతత కలుగుతుందని ఎంపీడీవో శ్రీనివాస్ నాయక్ తెలిపారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకుని యోగా సంసిద్ధత కార్యక్రమంలో భాగంగా బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులు, సిబ్బందితో యోగాసనాలను వేయించారు. ప్రతిరోజు యోగా చేయడం ద్వారా అనేక శారీరక రుగ్మతలకు దూరంగా ఉండవచ్చని తెలిపారు. యోగాను అలవాటుగా మార్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ అశ్రఫున్నిసా బేగం, ఈవోపీఆర్డీ వెంకటగిరి రెడ్డి, ఆర్ఐ పవన్ కుమార్, వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.



ధ్యాన బుద్ధ విగ్రహం వద్ద యోగాంధ్ర లాంచింగ్ కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం



యోగా చేస్తున్న వివిధ శాఖల మండల స్థాయి అధికారులు



బెల్లంకొండ మండల పరిషత్ కార్యాలయంలో యోగా చేస్తున్న వివిధ శాఖల సిబ్బంది

సంపూర్ణ ఆరోగ్యానికి ఆయుధం యోగా

మున్సిపల్ కమిషనర్ ఆనందకుమార్



మాట్లాడుతున్న కమిషనర్ ఆనంద్‌కుమార్

సత్తెనపల్లి: సంపూర్ణ ఆరోగ్యానికి ఆయుధం యోగా అని సత్తెనపల్లి మున్సిపల్ కమిషనర్ ఎన్.ఆనంద్ కుమార్ అన్నారు. పట్టణంలోని వావిలాల స్మృతి వనంలో పురపాలక సంఘం ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా యోగా తరగతులను బుధవారం ఆయన ప్రారంభించి మాట్లాడుతూ శారీరకంగా వ్యక్తపరిచే ఎలాంటి భంగిమైనా ఆసనమేనన్నారు. మెదడుకు, శరీరానికి బలమైన బంధాన్ని ఏర్పరిచేదే యోగాసనం అన్నారు. 84 ఆసనాలలో కొన్నిటినయినా సాధన చేయగలిగితే మానవుడు సంపూర్ణ ఆరోగ్యంగా జీవించవచ్చునన్నారు. భోజనంలో వరి అన్నం తగ్గిపోయి కొర్రలు, రాగులు, అరికలు, జొన్న రొట్టెలు, గోధుమ రొట్టెలు వచ్చి చేరాయని, ఏ ఆహారాన్ని అయినా కడుపునిండా కాకుండా కాస్త మితంగా తినడం అలవాటు చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా పలు ఆసనాలు వేయించారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, ఆర్పీలు తదితరులు ఉన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలి



పీహెచ్‌సీలో సేవల వివరాలను అడిగి తెలుసుకుంటున్న పల్నాడు జిల్లా మలేరియా అధికారి రవి రత్నాకర్

రెంటచింతల: స్థానిక పీహెచ్‌సీ కేంద్రానికి వివిధ రకాల వ్యాధులతో వచ్చే ప్రజలకు వైద్య సిబ్బంది మెరుగైన వైద్య సేవలను అందించాలని పల్నాడు జిల్లా మలేరియా అధికారి రవి రత్నాకర్ అన్నారు. స్థానిక పీహెచ్‌సీ కేంద్రాన్ని ఆయన బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. ల్యాబ్‌లో ప్రజలకు నిర్వహిస్తున్న పరీక్షలను తెలుసుకుని రికార్డులను పరిశీలించారు. రానున్న వర్షాకాలంలో దోమకాటు వలన మలేరియా ,ఫైలేరియా, చికెన్ గునియా, మెదడువాపు వచ్చే సీజన్ కాబట్టి ల్యాబ్ టెక్నీషీయన్లు కచ్చితంగా నిత్యం ఆస్పత్రిలో అందుబాటులో ఉండి రోగులకు మెరుగైన సేవలు అందించాలని కోరారు. మెడికల్ ఆఫీసర్లు క్షేత్రస్థాయిలో ఆరోగ్య సిబ్బందికి తగు సలహాలు, సూచనలను ఎప్పటికప్పుడు అందిస్తూ ఉండాలన్నారు. ప్రస్తుతం పీహెచ్‌సీ పరిధిలో వస్తున్న జ్వరం కేసుల వివరాలను మెడికల్ ఆఫీసర్లను అడిగి తెలుసుకున్నారు. ప్రతి రోజు పీహెచ్‌సీకి వచ్చే రోగుల వివరాలు (ఓపీ) నమోదు, ఆస్పత్రిలో రోగులకు ఆరోగ్య, ఆశ కార్యకర్తలు అందిస్తున్న సేవలు, రక్తపరీక్షల వివరాలు, మందులు ఇచ్చే విభాగం పనితీరు, వివిధ రికార్డులను పరిశీలించి తనిఖీ చేశారు. తొలుత గ్రామంలోని వివిధ సాంఘిక సంక్షేమ వసతి గృహాలను ఆయన సందర్శించి తలుపులకు, కిటికీలకు మస్కిటో మెష్‌లను అమర్చుకోవాలని సూచించారు. త్వరలో విద్యాసంవత్సరం ప్రారంభం కానున్న నేపథ్యంలో వసతి గృహాలలో మలాథియన్ స్ప్రేయింగ్ చేపట్టిన తీరును పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ హేమ, మలేరియా ఆరోగ్య పర్యవేక్షకులు సీహెచ్ అంకమ్మ రావు, సూపర్ వైజర్ ఎన్.కోటేశ్వరరావు, ల్యాబ్ టెక్నీషియన్ దుర్గారావు పాల్గొన్నారు.